నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | RANGAREDDY

విద్యార్థులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, హరీశ్‌రావు

ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్

సీఎంకు పాలనపై దృష్టిలేదు

ఆడపిల్లలు ధర్నా చేస్తే ఎందుకు స్పందించరు
పాలమాకుల కసూర్బా గాంధీ హాస్టల్ సందర్శనలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి
మేమున్నాం..భయపడొద్దంటూ..
విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31: 'ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే ప్రభుత్వం ఎందుకు స్పందించదు.. సీఎం ఏం చేస్తున్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప.. పాలన మీద దృష్టి లేకపోవడం విడ్డూరంగా ఉన్నది' అని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలంటూ.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని కస్తూర్బాగాంధీ హాస్టల్ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం హాస్టల్‌ను మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'హాస్టల్‌లో మా పిల్లలు ఇబ్బందులుపడుతున్నారు. మీరే చూడాలి' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా, స్పందించిన హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి.. 'మీకు మేమున్నాం.. మీకేం కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకే కాదు.. రాష్ట్ర ప్రజలకు కూడా ఎక్కడ చూసినా అన్యాయమే జరుగుతున్నది' అని అన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. మీ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా.. మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లో వండుతున్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికీ చెప్పుకోవాలో తెలియక కిలోమీటర్ దూరం వెళ్లి.. రోడ్డెక్కి ధర్నా చేసే పరిస్థితి వచ్చిందంటే లోపం ఎక్కడ ఉన్నదో అర్థమవుతున్నదన్నారు. కులం పేరుతో దూషిస్తున్నట్లు విద్యార్థులు కన్నీరుపెట్టుకోవడం బాధాకరమన్నారు. ఏదైనా అడిగితే కర్రలు విరిగేలా కొడుతున్నారని చెప్పినట్లు పేర్కొన్నారు. ఓ విద్యార్థి టీచర్ కొట్టిన దెబ్బలకు గాయమైన చేతిని చూపుతూ.. ఏడుస్తున్న తీరు కలిచివేసిందన్నారు. 'ఇప్పటివరకు కేవలం ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారు. మరో జత అడిగితే ఇవ్వడం లేదు. పుస్తకాలు సైతం ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, కస్తూర్బాగాంధీ హాసళ్లపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది' మాజీ మంత్రులు విమర్శించారు.

కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో అన్నం పెడితే..

గతంలో కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో అన్నం పెడితే.. మీరు గొడ్డుకారం పెడుతున్నారు' అని హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వివిధ గురుకులాలకు చెందిన 500 మంది దవాఖాన పాలయ్యారు. 38 మంది పిల్లలు చనిపోయారు. పాములు కరిచి చనిపోతున్నారు. ఎలుకలు కొరికి దవాఖానల్లో చేరుతున్నారు. ఒకప్పుడు గురకులాల్లో చదవడం కల.. ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు. హాస్టల్ విద్యార్థులపై కించపరిచేలా మాట్లాడటం సరికాదు. పిల్లలు భయపడుతున్నారు. ఇక్కడ ఉన్న టీచర్లను మార్చి కొత్తవారిని తీసుకొచ్చి.. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి' అని డిమాండ్ చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. విద్యాశాఖ నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు. మైనార్టీ గురుకులాలకు జనవరి నుంచి మెస్ బిల్లులు ఇవ్వడం లేదు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో కాస్మోటిక్ చార్జీలు, కరెంట్ బిల్లులు ఇవ్వలేదు' అని ఇప్పటికైనా సీఎం పాలనపై దృష్టి పెట్టి సమీక్షలు చేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్‌ను సందర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ సతీశ్ తదితరులు ఉన్నారు.

మా పిల్లలను వేధించడం తగదు

మా పిల్లలను చదువుకోవడానికి పంపిస్తే వేధింపులకు గురి చేయడం సరికాదు. దుస్తులు ఇవ్వకపోవడం ఏమిటి ? ఇది హాస్టల్ సిబ్బందికి భావ్యం కాదు. మంచి అన్నం పెట్టమంటే కులం పేరుతో దూషించడం ఏమిటి ? గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదు.

- లావణ్య, విద్యార్థిని తల్లి

మా పిల్లలకు ఏం జరిగినా..

మా పిల్లలకు ఏం జరిగినా ఉపాధ్యాయులదే బాధ్యత. మేం పేదోళ్లం అందుకే హాస్టల్‌లో వేసినం. మా కులం పేరుతో దూషించడం సరైన పద్ధతి కాదు. చదువుకున్నోళ్లు అనే మాటలేనా.. ఉపాధ్యాయులను పూర్తిగా మార్చివేసి.. మా పిల్లలకు న్యాయం చేయాలి.

-కుమార్, విద్యార్థిని తండ్రి

స్టాఫ్‌ను పూర్తిగా మార్చినం

హాస్టల్‌లో విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలంటూ.. ఆందోళనకు దిగిన విషయం తెలుసుకొని వెంటనే డీఈవో సుశీంధర్‌రావు హాస్టల్‌ను సందర్శించి.. మాకు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లో స్టాఫ్‌ను పూర్తిగా మార్చినం.

- సుజాత, జీసీడీవో
(గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)

అప్రమత్తంగా ఉండండి

అధికారులకు సూచించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 31 : జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం ఎస్పీతో కలిసి కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులంతా అప్రమత్తం గా ఉండాలన్నారు. రానున్న రెండు, మూడు రోజులు సైతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ సూచించిందని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పాతబడిన మిద్దెలు ఉండి శిథిలావస్థకు చేరుకొని ఉంటే అలాంటి వాటిని గుర్తించి వెంటనే అందులో నుంచి కుటుంబాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. మురుగు కాల్వలు నిండి ఓవర్ ఫ్లో కాకుండా చూసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే వెంటనే నివేదిక సిద్ధం చేసి పంపించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యుత్తు సమస్య లేకుండా చూసుకోవాలని, పాతబడి కుంగిపోయిన విద్యుత్తు స్తంభాలు ఉంటే వెంటనే మార్చాలని, వైర్లు కిందికి వేలాడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఏమైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వికారాబాద్ జిల్లా హెల్ప్ లైన్ నం : 08416 242136

అలుగు పారుతున్న వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివసాగర్ ప్రాజెక్టు

రంగారెడ్డి జిల్లా నవాబుపేట మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

దంచికొట్టింది..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపార్లగా, వికారాబాద్ జిల్లాలోని మూసీ, కాగ్నా నదులు, రంగారెడ్డి జిల్లాలోని ఈసీ వాగుతోపాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. పలు చెరువులు, కుంటలు నిండడంతో పాటు వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. మరో రెండు రోజులూ భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ, మూసీ, కాగ్నా నదులు
- బురదమయంగా గ్రామీణ రోడ్లు, స్తంభించిన రవాణా
- మరో రెండు రోజులూ భారీ వర్ష సూచన
- వికారాబాద్ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ
- అత్యధికంగా చౌడాపూర్ మండలంలో 70.2 మి.మీ వర్షం
- రంగారెడ్డి జిల్లాలో 13.6 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా కొందుర్గు మండలంలో 38.5 మి.మీ వర్షం

రంగారెడ్డి జిల్లాలో నమోదైన వర్షపాతం	
శంకర్‌పల్లి	24.1
శేరిలింగంపల్లి	11.6
గండిపేట్	7.8
రాజేంద్రనగర్	9.1
బాలాపూర్	4.2
సరూర్‌నగర్	3.8
హయత్‌నగర్	3.8
అబ్దుల్లాపూర్‌మెట్	3.2
ఇబ్రహీంపట్నం	5.1
మంచాల	3.9
యాచారం	6.8
మాడ్గుల	6.5
ఆమనగల్లు	7.3
తలకొండపల్లి	20.5
కేశంపేట	25.8
కడ్తాల్	4.3
కందుకూర్	6.7
మహేశ్వరం	9.4
శంషాబాద్	11.2
మొయినాబాద్	12.1
చేవెళ్ల	29.5
షాబాద్	19.9
కొత్తూరు	18.3
నందిగామ	20.3
ఫరూఖ్‌నగర్	21.7
కొందుర్గు	38.5
చౌదరిగూడ	31.0
జిల్లా మొత్తం	13.6 మి.మీ

వికారాబాద్ జిల్లాలో నమోదైన వర్షపాతం	
మండలం	మి.మీటర్లు
చౌడాపూర్	70.2
కోట్‌పల్లి	27.9
బంట్వారం	21.4
వికారాబాద్	42.2
బషీరాబాద్	42.8
పూడూరు	43.9
మోమిన్‌పేట	42.2
యాలాల	38.9
తాండూరు	36.7
దోమ	51.6
దుద్యాల	55.3
పెద్దేముల్	22.6
కొడంగల్	42.5
దౌల్తాబాద్	53.3
కులకచర్ల	65.6
పరిగి	55
మర్పల్లి	14.8
ధారూరు	45.6
బొంరాస్‌పేట	50.0
జిల్లా మొత్తం	43.1 మి.మీ

వికారాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. వికారాబాద్-గిరిగెట్‌పల్లి మధ్య, నస్కల్ వాగు వరదతో పరిగి-వికారాబాద్ రాకపోకలు నిలిచిపోగా, దోర్నాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ధారూరు-దోర్నాల తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు స్తంభించాయి. మరో రెండు రోజులూ భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలను చేపట్టింది. అత్యవసర సమయంలో సాయం చేసేందుకు విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. వాగుల వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఆగస్టు నెలలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. 8 మండలాలు మినహా అన్ని మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టు నాటికి సాధారణ వర్షపాతం 466.8 మి.మీటర్ల కాగా, ప్రస్తుతం 576.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

మత్తడి దుంకుతున్న చెరువులు.. నీట మునిగిన పంటలు..

జిల్లాలోని పలు చెరువులు మత్తడి దుంకుతున్నాయి. జిల్లా కేంద్రంలోని శివసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారి అలుగుపారుతున్నది. సర్పన్‌పల్లి చెరువు నిండింది. పరిగి, కులకచర్ల, దోమ, చౌడాపూర్, మర్పల్లి, ధారూరు మండలాల్లోని చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి. వాగులు, చెరువులకు సమీపంలోని పొలాలు నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

రంగారెడ్డి జిల్లాలో...

షాబాద్ : రంగారెడ్డి జిల్లాలో శనివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అత్యధికంగా కొందుర్గు మండలంలో 38.5 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో కురిసిన భారీ వర్షానికి ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గ్రామీణ రోడ్లు ధ్వంసమై బురదమయంగా మారడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో నాగరగూడ ఈసీ వాగు పారుతుందని, షాబాద్ మండలంలో అనుకున్న స్థాయిలో వర్షాలు పడడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు పెద్దగా వర్షం పడకపోవడంతో చెరువుల్లోకి నీరు రాలేదు. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతోనైనా భారీ వర్షాలు కురిస్తే ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నిండుతాయని రైతులు చెబుతున్నారు.

కడ్తాల్-తలకొండపల్లి రహదారిపై విరిగిపడిన చెట్టు

మొయినాబాద్‌లోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీళ్లు

వికారాబాద్ నుంచి గిరిగెట్‌పల్లి వెళ్లే దారిలోని వాగు వద్ద పోలీసుల బందోబస్తు

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

పరిగి సమీపంలోని వాగు కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శనివారం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందు ఏ విధమైన ఆకస్మిక విపత్తు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు, వరద ప్రాంతాల నుంచి ప్రజలు వెళ్లకుండా తగు నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా ఉధృతంగా పారే వాగుల వద్ద ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు, మ్యాన్ హోళ్లను తెరవకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను తరలించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల తీసుకునే జాగ్రత్తలపై ప్రజలను ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాల ద్వారా చైతన్య పరచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ట్యాంకులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగు మందులను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. వరదలు, వర్షాల వల్ల కొన్ని చోట్ల చెరువులకు స్థానికులు గండ్లు పెట్టే అవకాశం ఉన్నదని, దీనివల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయన్నారు. పోలీస్, నీటి పారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలతో కలిసి సమన్వయంతో పని చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్తు, రోడ్డు భవనాల శాఖ, మిషన్ భగీరథ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా హెల్ప్ లైన్ నం : 040-23237416